క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ నూకవరపు మనీషా ఫౌండేషన్, గుంటూరు రోటరీ క్లబ్ అచీవర్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత పాలిసెట్ శిక్షణ శిబిరానికి హాజరవుతున్న 250 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మంగళవారం విద్యానగర్, కొత్తపేటలోని ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమాల్లో ప్రతి విద్యార్థికి రూ.400 వ్యయంతో సైన్స్, మ్యాథ్స్ పుస్తకాలు, పాలిసెట్ మోడల్ పేపర్ల సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ అచీవర్స్ అధ్యక్షుడు పిడికిటి తిలక్‌బాబు మాట్లాడారు. గత మూడేళ్లుగా మనీషా ఫౌండేషన్ విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. గతేడాది ఫౌండేషన్ 12 మంది విద్యార్థులను ఉచితంగా చదివించిందని చెప్పారు. ఫౌండేషన్ చైర్మన్ నూకవరపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇకపై వార్షిక పరీక్షల్లో అధిక మార్కులు సాధించే విద్యార్థులకు రూ.5 వేలు నగదు, ప్రశంసా పత్రం అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నల్లూరి సాంబశివరావు, కోశాధికారి కొండపనేని విజయ్‌కృష్ణ, మాదిరెడ్డి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

షుగర్‌ను ప్రారంభ దశలోనే నియంత్రించాలి



గుంటూరు మెడికల్: టైప్ -2 షుగర్ ఉన్నవారు ప్రారంభదశలోనే షుగర్‌ను నియంత్రణలో పెట్టుకోవడం ద్వారా దాని ఫలితాలు 40 సంవత్సరాల కుపైగా ఉపయోగంలో ఉంటాయని పరిశోధనలో తేలినట్లు ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు, గుంటూరుకు చెందిన ఎస్‌వీఆర్ డయాబెటీస్ సెంటర్ అధినేత డాక్టర్ వీవీ రామ్‌కుమార్ అన్నారు. వారణాసీలో మధుమేహ వ్యాధిపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. సదస్సులో డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడారు. షుగర్‌ను నియంత్రణలో పెట్టుకోవడం ద్వారా కిడ్నీలు పాడవకుండా, హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చన్నారు. వైద్య సలహాలు పాటించడం ద్వారా ఆయుష్షు పెంపొందించుకోవచ్చు అన్నారు.

జీఎంసీ కమిషనర్ పీఏగా శివన్నారాయణరావు

నెహ్రూ నగర్: జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి పీఏగా వైవీఎల్ శివన్నారాయణరావును నియమిస్తూ మంగళవారం రాత్రి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం జే సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శివన్నారాయణ రావుకు అదనంగా కమిషనర్ పీఏ బాధ్యతలు అప్పగించారు.

వలంటీర్ల ద్వారానే పింఛన్లు పంపిణీ చేయాలి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లను వలంటీర్ల ద్వారానే ఇంటింటికి వెళ్లి అందించేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగ విభాగం నాయకుడు బండారు దుర్గారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకునే పరిస్థితి లేదని తెలిపారు. పట్టణాల్లో కొన్ని వార్డు సచివాలయాలు రెండో అంతస్తులో ఉన్నారని, ఎలక్షన్ కమిషన్ పింఛన్ల పంపిణీలో పునరాలోచన చేయాలని పేర్కొన్నారు.

నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

కాకుమాను: పెదనందిపాడు మండల ఎంఈఓ కార్యాలయం వద్ద బుధవారం ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఐఈడీ టీచర్ కె.వి.ఎస్.పూర్ణచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకుమాను, పెదనందిపాడు, పొన్నూరు, ప్రత్తిపాడు మండలాల్లోని 6–18 సంవత్సరాల వయస్సు గల ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ప్రముఖ ఫిజియోథెరపిస్టుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షల అనంతరం వారికి అవసరమైన పరికరాలను గుర్తించి, రెండు నెలల్లో ఉచితంగా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. శిబిరానికి వచ్చే వారు సంబంధిత ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులతో పాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకు రావాలని ఆయన కోరారు. శిబిరానికి వచ్చేవారికి బస్ చార్జీలతో పాటు అల్పాహారం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు మండలాల్లో ఉన్న ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి లేఖన క్రీస్తు మహాసభలు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని రైల్వేస్టేషన్ సమీపంలో ఈ నెల 3, 4, 5 తేదీలలో లేఖన క్రీస్తు మహాసభలు నిర్వహిస్తున్నట్లు బ్రదర్ ఎ.పరిశుద్ధరావు మంగళవారం తెలిపారు. హోలీ అపోస్తలిక్ మిషన్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 11 గంటలకు, సాయంత్రం 6.30 గంటలకు సభలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రజలు మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా నియమించడానికి వీల్లేదు

స్పష్టం చేసిన జీఎంసీ కమిషనర్, ఆర్వో కీర్తి చేకూరి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తూర్పు నియోజకవర్గ ఆర్‌ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా నియమించడానికి వీల్లేదని జీఎంసీ కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం తన చాంబరులో కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల సరళిలో పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు ఉండడానికి వీలులేదని తెలిపారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ప్రచార ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలు చేపట్టడానికి రిటర్నింగ్ అధికారి నుంచి తగిన అనుమతులు పొందాలన్నారు. ఇందుకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు వేర్వేరుగా సింగిల్ విండో కౌంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. సింగిల్ విండో ద్వారా అనుమతులు త్వరగా వచ్చేలా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటామన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, లౌడ్ స్పీకర్ల వినియోగం, బోర్డులు, బ్యానర్లు, తాత్కాలిక పార్టీ కార్యాలయాల ప్రారంభం తదితర అంశాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి పొందాలన్నారు. నగరంలోని ప్రైవేట్ హోర్డింగ్స్, బోర్డులను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమాన ప్రాతిపదికగా కేటాయించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారి అనుమతి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన రాజకీయ పార్టీలకు కేటాయింపులు చేస్తామని తెలిపారు. నగరంలోని పెద్ద హోర్డింగ్స్ స్ట్రక్చరల్ స్టేబులిటీ సర్టిఫికెట్ తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ ప్రసాద్, సూపరింటెండెంట్ పద్మ, డి.జానిబాబు (వైఎస్సార్ సీపీ), ఓంకార్ (టీడీపీ), సీహెచ్.వాసు (బీఎస్పీ), పాండురంగ విఠల్ (బీజేపీ) సేవకుమార్ (ఆమ్ ఆద్మీ), జాని బాష (కాంగ్రెస్) పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలు తక్షణం పరిష్కరించేలా శిక్షణ

నెహ్రూనగర్: ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులకు ఎన్నికల సరళిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు పరిష్కరించేలా మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ అందించాలని జీఎంసీ కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో రూట్, సెక్టోరల్ అధికారులకు ఈవీఎంల నిర్వహణపై అందిస్తున్న డెమో శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వారికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కీర్తి మాట్లాడారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరుపై సెక్టోరల్, రూట్, ఇంజినీరింగ్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ సమయంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు పరిష్కారించేలా మాస్టర్ ట్రైనర్లు శిక్షణ అందించాలన్నారు. పూర్తిస్థాయి శిక్షణలో పాల్గొనకపోవడంపై రూట్ ఆఫీసర్లు మణికంఠ, సునీతకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను మరోసారి చెక్ చేసుకోవాలని, ఓటర్ల సంఖ్య, కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బుధవారం నుంచి రోజుకొక సెక్టోరల్ అధికారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు, బీఎల్వోలు ఎవరు సహకరించక పోయినా రిపోర్ట్ ఇస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ శిక్షణలో ఏఆర్వోలు సునీల్, భీమరాజు, సెక్టోరల్ అధికారి శ్రీధర్, ఎస్ఈ శ్యాంసుందర్, ఈఈ సుందరరామిరెడ్డి, మేనేజర్ ఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థ నాయకుల ఎంపికలో యువ ఓటర్లు కీలకం



నంబూరు వీవీఐటీలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ ఎ.లక్ష్మీకుమారి



ఓటర్ల ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పొన్నూరు అసెంబ్లీ ఆర్వో, డిప్యూటీ కలెక్టర్ ఎ.లక్ష్మీకుమారి

పెదకాకాని: సమర్థవంతమైన నాయకుల ఎంపికలో యువ ఓటర్లు కీలకమని, యువత తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పొన్నూరు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ ఎ.లక్ష్మీకుమారి అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ స్వీప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నూతన ఓటర్ల అవగాహన సదస్సుకు పొన్నూరు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ అరి లక్ష్మీకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీకుమారి మాట్లాడుతూ ఓటు హక్కుగల విద్యార్థులు తప్పనిసరిగా వినియోగించుకోవాన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా సమాజానికి మంచిచేసే నాయకులను ఎన్నుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తమవంతు కర్తవ్యంగా ఇతరులకు మంచిచేయాలని, ఓటు వినియోగంపై అవగాహన కలిగించాలని అన్నారు. పెదకాకాని తహసీల్దార్ పెల్లూరి రత్నం మాట్లాడుతూ ఓటు చాల కీలకమైనదనీ, మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో నూతన ఓటర్లు తప్పనిసరిగా నూరు శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. తాము ఓటు వేయటమే కాకుండా ఇతరులకు అవగాహన కలిగించి ఓటు వేయించాలని కోరారు. ఈ సదస్సులో వీవీఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పోలింగ్ బూత్ నమూనా, ఓటు వినియోగం తెలియజేస్తూ లఘునాటకను ప్రదర్శించారు. ప్రశాంత ఎన్నికలకు సహకరిస్తామని, ప్రలోభాలకు ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ఓటు హక్కు వినియోగించుకుంటామని ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓలు బలరాం నాయక్, శంకర్ రాజు, ఎన్ఎస్ఎస్ అధికారి ఐఎల్‌జే భక్తసింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- వివాదాస్పద గ్రామాలు, వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా
- పీస్ కమిటీ సమావేశంలో తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్



మాట్లాడుతున్న తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్

తాడికొండ: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పార్టీలు, ప్రజల సహకరించాలని తుళ్ళూరు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ సూచించారు. సోమవారం తాడికొండ షిర్డీసాయి పర్తిసాయి కల్యాణ మండపంలో నియోజకవర్గ పరిధిలోని పలు పార్టీలతో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వివాద రహితంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందని, ఇందులో భాగంగా ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలు, సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. రౌడీ షీటర్లు, కేడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, వివాదాల్లో తల దూర్చితే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రూపు విభేదాలను విడనాడి గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉన్నందున అందరూ సహకరించాలని సూచించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ చట్టరీత్యా నేరమని, అలాంటివి ఎక్కడైనా జరిగితే తమకు సమాచారం అందించాలని సూచించారు. తాడికొండ, తుళ్ళూరు, మేడికొండూరు, ఫిరంగిపురం సీఐలు సీహెచ్ ప్రభాకర్‌రావు, షేక్ సుభానీ, అనురాధ, డి.జయకుమార్, వీరేంద్ర పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఆదుకుంటాం

తెనాలిఅర్బన్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సమగ్ర శిక్ష జిల్లా ఎడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి, మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణలు పేర్కొన్నారు. బాలాజీరావుపేటలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత నిర్ధారణ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బుద్ధి మాంద్యం, వినికిడి, దృష్టి లోపాలు ఉన్న వారికి పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. శారీరక వైకల్యం ఉన్న వారికి వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, రోటోవెటర్స్, బుద్ధి మాంద్యం ఉన్న వారికి ఎంఆర్ కిట్స్, కంటి చూపు దెబ్బతిన్న వారికి బ్రెయిలీ కిట్లు అందిస్తామని చెప్పారు. వీటన్నిటిని ప్రభుత్వం ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. అలాగే భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. పిల్లల రవాణా అలవెన్స్‌లు, ఎస్కార్ట్, హెచ్‌బీఏ, రీడర్ అలవెన్స్‌లు, గర్ల్స్ స్టైపెండ్ వంటివి ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. ఎంఈవో-2 వి.జయంతిబాబు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సహకారంతో భవిత కేంద్రాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అనంతరం జిల్లా వైద్యశాలలోని వైద్యులు చిన్నారులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సహిత విద్యా విభాగం సమన్వయ కర్త ఎస్.శ్రీనివాసరావు, పలువురు టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చేబ్రోలు మాజీ సర్పంచ్ వెంకటప్పారెడ్డి మృతి



చేబ్రోలు: చేబ్రోలు మాజీ గ్రామ సర్పంచ్ గాదె వెంకటప్పారెడ్డి(95) సోమవారం రాత్రి మృతి చెందారు. చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన గాదె వెంకటప్పారెడ్డి 1980–85 మధ్య చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా పనిచేసి ప్రజల మన్ననలు పొందారు. కొత్తరెడ్డిపాలెంలో జన్మించిన వెంకటప్పారెడ్డి వ్యవసాయం, విద్య, సమాజ, సాంఘిక సేవా కార్యక్రమాల్లో అగ్రగామిగా నిలిచారు. పొగాకు రంగంలో మంచి ఖ్యాతి పొందారు. 2002 సంవత్సరంలో పొగాకు రైతుల జీవితకాల సాధన అవార్డును పొందారు. చేబ్రోలు ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. భారత ప్రభుత్వం వాణిజ్యశాఖ తంబాకు బోర్డులో ఉప చైర్మన్‌గా ఆయన విశేష సేవలు అందించారు. ఆల్ ఇండియా టుబాకో బోర్డు అధ్యక్షుడిగా, కొండవీటి కమిటీ ఉన్నత పాఠశాల సెక్రటరీగా పనిచేశారు. తెనాలి సమితి రెడ్డి హాస్టల్ ప్రెసిడెంట్‌గా చేశారు. వెంకటప్పారెడ్డికి భార్య, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. సోమవారం రాత్రి మరణించిన వెంకటప్పారెడ్డి అంత్యక్రియలు మంగళవారం స్వగ్రామంలో జరిగాయి. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ పెద్దలు, బంధువులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: బాలుడు కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వల్లూరివారితోట 9వ లైనులో నివాసం ఉండే హర్షవర్ధన్ అనే బాలుడు గత నెల 31న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకి కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న సోదరుడు గణేష్‌బాబు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం.సుబ్బారావు తెలిపిన వివరాలు ప్రకారం ఆర్.అగ్రహారం కోనేరు సెంటర్‌లో నివాసం ఉండే బేతాళ రాజేష్ (38) వంట పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన రాజేష్, భార్య గతేడాది పిల్లలను తీసుకుని వెళ్లి పోయింది. ఈ క్రమంలో ఒంటరిగా జీవిస్తున్న రాజేష్ మనస్తాపానికి గురై.. మంగళవారం తన నివాస ప్రాంతంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాల మేరకు.. శ్రీరామ్‌నగర్ 7వ లైనులో నివాసం ఉండే షేక్ అమరాబీ రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకి కోసం వెతికిన తండ్రి షేక్ మస్తాన్‌వలి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

పిడపర్రు(కొల్లిపర): మండలంలోని 51 పోలింగ్ కేంద్రల్లో పక్కాగా వసతులు కల్పించాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని పిడపర్రు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్‌లతో కలసి తనిఖీ చేశారు. బీఎల్‌వోల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి, కేంద్రాల్లో ఓటర్లకు కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విభిన్న ప్రతిభావంతులు వంద శాతం ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కలిగించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. పింఛన్ల కోసం నగదును బ్యాంకుల నుంచి తీసుకురావడం, పంపిణీ చేసే ప్రక్రియను తహసీల్దారు, ఎంపీడీవోలు పకడ్బందీగా పంపిణీ పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు చంద్రమోహన్, పూర్ణశంకరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లు



మంగళగిరి: కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో మార్చి 30, 31వ తేదీలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో గుంటూరు జిల్లా పవర్ లిఫ్టర్లు పతకాలు సాధించినట్లు పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరరావు తెలిపారు. పట్టణంలోని అసోషియేషన్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ స్కూలు గేమ్స్‌లో అండర్ -17, 19 విభాగాలలో పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లు అసోషియేషన్ కార్యదర్శి షేక్ సంధాని పలువురు అసోషియేషన్ ప్రతినిధులు అభినందించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన వారిలో అండర్ -17లో పి.అంజిలి(స్వర్ణ పతకం), ఇ.లక్ష్మి వినయశ్రీ (స్వర్ణం), జి.హేమవర్ధన్ (స్వర్ణం) సాధించడంతో పాటు స్ట్రాంగ్ టైటిల్ సాధించారన్నారు. అండర్ - 19లో పి.శ్రావణి (స్వర్ణం), గుమ్మడి కుమార్ (స్వర్ణం), వై.నిఖిల్ స్వర్ణ పతకం సాధించినట్లు తెలిపారు.

నర్సింగ్ కళాశాలలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న వైస్ ప్రెసిడెంట్ సదాశివరావు

గుంటూరు మెడికల్: గోరంట్ల ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వసతి భవనంలో నాట్కో ట్రస్టు ప్రతినిధులు ఆర్వో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ అభ్యర్థన మేరకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును మంగళవారం ట్రస్టు వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంటూరు జీజీహెచ్‌లో రూ. 45 కోట్లతో నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మించి పేదలకు అంతర్జాతీయ స్థాయి క్యాన్సర్ వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థినుల సమస్యలపై తమ ట్రస్టు తక్షణమే స్పందించి ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాధారమణశ్రీ, పరిపాలన అధికారి వెంకట్రావు, ఆఫీస్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్లు కూరాకుల శ్రీనివాస్, లంకపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథమే ప్రగతికి పునాది



మాట్లాడుతున్న సలీమ్ మాలిక్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో అడుగులు వేయడం ద్వారా ప్రగతిని సాధించగలరని మానవత రక్త దాతల సంస్థ ఆంధ్రప్రదేశ్ కో- కన్వీనర్ సలీమ్ మాలిక్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని టార్గెట్ ఐఐటీ అకాడమీలో మంగళవారం "రక్తదానంపై అవగాహన- శాస్త్రీయ దృక్పథం" అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 18 ఏళ్ల నిండి, ఆరోగ్యవంతులుగా ఉన్న వారు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసంగిస్తూ రెండేళ్లుగా గుంటూరు నగరంలోని అనాథ, వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సలీమ్ మాలిక్ వివిధ రకాల మాయలతో ప్రజలను బురిడీ కొట్టించే విధానాన్ని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. శిక్షణ సంస్థ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, సామాజికవేత్త కంది పున్నారెడ్డి, మానవత సభ్యులు నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నకిలీ వార్తలు ప్రజాస్వామ్యానికి ముప్పు

లక్ష్మీపురం: నకిలీ వార్తలు భారత దేశం వంటి ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ముప్పును కలిగిస్తున్నాయని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం ఫ్యాక్ట్ - చెకింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత ఆర్టీసీ అధికారి వీఎస్ఎస్ మల్లేశ్వరరావు మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో సమాచారం వేగంగా అందరికి చేరిపోతోందన్నారు. ఇందులో పెద్ద ఎత్తున తప్పుడు సమాచారం ఉంటోందని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్ నాయకులు తిరుపతయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తప్పుడు సమాచారం, వార్తలు ప్రజాస్వామ్య పునాదులను పెకిలించి వేస్తాయన్న ఆందోళనలను మేధావులు వ్యక్తంచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త ఇ.చంద్రయ్య, సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఔషధ తయారీలో భారతదేశం ముందంజ

- నాట్కో ఫార్మా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు
- ఘనంగా చలపతి ఫార్మసీ కళాశాల 20వ వార్షికోత్సవం



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఔషధ తయారీ, పరిశోధన రంగాల్లో భారతదేశం ముందంజలో ఉందని నాట్కో ఫార్మా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాంనందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో కళాశాల 20వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ తాను ఫార్మసీ విద్యార్థినేనని ఫార్మా రంగంలో ప్రస్తుతం ఎన్నో అవకాశాలున్నాయన్నారు. నాట్కో కంపెనీ అతి ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధికి ఔషధాన్ని మొట్టమొదటిసారిగా కనుగొన్నదని చెప్పారు. బయోఫోర్స్ ఫోర్స్ ఫార్మాస్యూటికల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆర్.జగదీష్ మాట్లాడుతూ 1820లో కలరా, 1920లో ఫ్లూ, 2020లో కరోనా ఈ విధంగా ప్రతి వంద సంవత్సరాలకు ఒకసారి ఏదోక విపత్తు సంభవిస్తూనే ఉందని, అటువంటి సమయంలో నూతన ఔషధాలను తయారు చేసి ఫార్మారంగం ప్రజలు జీవితాలకు భరోసాను కలిగిస్తుందన్నారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎటువంటి రుగ్మతకైనా ఔషధమే విరుగుడన్నారు. బాంబే కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఆల్కాముఖని, అరిజియన్ లైఫ్ సైన్సెస్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ అనూప్ కుమార్, ఎమ్మెల్సీ డాక్టర్ కె.ఎస్.లక్ష్మణరావులు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, వైవి ఆంజనేయులు గోల్డ్ మెడల్, అనంతకుమారి గోల్డ్‌మెడల్, అందజేశారు. అదేవిధంగా నూరుశాతం అటెండెన్స్ అవార్డ్, బెస్ట్ లైబ్రేరియన్ అవార్డ్, ఎన్ఎస్ఎస్ బెస్ట్ వలంటీర్ అవార్డ్ వంటి అవార్డులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్ కుమార్, డాక్టర్ అనూప్‌కుమార్, డాక్టర్ విరుణ, వై.అశోక్‌కుమార్ అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం 20 సంవత్సరాల సావనీరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులున్నారు.

రవాణా రంగాన్ని నిర్వీర్యం చేసినవారిని ఓడించండి

ఆల్ ఇండియా రోడ్డు రవాణా ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ



ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ

తాడేపల్లిరూరల్: దేశవ్యాప్తంగా రవాణా రంగాన్ని నిర్వీర్యం చేసిన బీజేపీ, మిత్ర పక్షాల పార్టీల అభ్యర్థులను ఓడించాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా వడ్డేశ్వరం, కొలనుకొండ, కుంచనపల్లి ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులతో, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులతో కలసి కొలనుకొండ జాతీయ రహదారి వద్ద సీఐటీయూ ఆటో యూనియన్ వద్ద సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత పదేళ్ల కాలంలో రోడ్డు, రవాణా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని అన్నారు. తమకు సామాజిక భద్రత చట్టం కావాలని కార్మికులు గత కొన్ని సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నా, బీజేపీ ప్రభుత్వం రవాణా రంగ కార్మికుల చట్టాలను తుంగలో తొక్కిందన్నారు. రవాణా రంగాన్ని కాపాడుకునేందుకు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వామ పక్ష లౌకిక శక్తులను గెలిపించాలని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ఆటో రిక్షా డ్రైవర్లలో అత్యధికులుగా యజమానులు స్వయంగా ఆటోలు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. ప్రస్తుత తరుణంలో రవాణా రంగ అధికారులు, పోలీసుల వేధింపులతో ఆటో డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన పార్టీ అభ్యర్థులను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, బి.గోపాల రెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, ఆటో డ్రైవర్, వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కె పున్న, బాషా, బొడ్డు శంకరరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.